# విశిష్ట సేవలకు డాక్టర్లకు రాష్ట్ర స్థాయి గౌరవం







**ఖమ్మం/ ఏప్రిల్ 7 (జర్నలిస్ట్ వార్త):**
ప్రజల ఆరోగ్య రక్షణలో అహర్నిశలు కృషి చేస్తున్న వైద్యులకు రాష్ట్ర ప్రభుత్వం ఘన సత్కారం అందించింది. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు వైద్యులు అవార్డులు అందుకుని ప్రతిభ చాటారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. రాజశేఖర్ గౌడ్ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అందించిన విశిష్ట సేవలకు గాను రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు. అలాగే పెనుబల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు చెందిన డా. ఎన్. కిరణ్ కుమార్, డా. బి. శివరామకృష్ణ, కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు చెందిన డా. రామ్ శరణ్‌లు తమ సేవలతో గుర్తింపు పొందుతూ సత్కారం పొందారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజా నరసింహా, శాఖ కార్యదర్శి క్రిస్టినా చౌంతు, టీవీవీపీ కమిషనర్ డా. అజయ్ కుమార్ చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ముందుండి సేవలందిస్తున్న జిల్లాకు చెందిన వైద్యులు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడం విశేషమని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్యులను సహచరులు, ప్రజలు అభినందించారు.

# పట్టుదలే విజయానికి మార్గం

## పెద్ద పెండ్యాల యువకుడు డా. పెసరు రాజుకు డాక్టరేట్





తల్లిదండ్రులు పెసరు పద్మ, వెంకటయ్య



డాక్టర్ పెసరు రాజు

**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరో ఏప్రిల్ 7 (జర్నలిస్ట్ వార్త)**
హనుమకొండ జిల్లా పెద్ద పెండ్యాల గ్రామానికి చెందిన యువకుడు డా. పెసరు రాజు తన కృషి, పట్టుదలతో ఉన్నత విద్యలో అరుదైన ఘనతను సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. సాధారణ కుటుంబంలో జన్మించిన ఆయన చిన్ననాటి నుంచే చదువులో ప్రతిభ చూపుతూ, సమాజానికి ఉపయోగపడే వ్యక్తిగా ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగారు. తల్లిదండ్రులు పెసర పద్మ, వెంకటయ్య అందించిన ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత్వం ఆయన విజయానికి బలమైన పునాది అయ్యాయి. పెద్ద పెండ్యాల ప్రభుత్వ పాఠశాలలో మొదటి తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యను అభ్యసించిన పెసరు రాజు, అనంతరం స్టేషన్ ఘనపూర్ ప్రభుత్వ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. చిన్నప్పటి నుంచే చదువుపై ఆసక్తి చూపిన ఆయన, ప్రతి దశలోనూ కష్టపడి ముందుకు సాగుతూ తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకున్నారు. ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదురైనా వెనుకడుగు వేయకుండా పట్టుదలతో చదువును కొనసాగించారు.

విద్యపై ఉన్న నిబద్ధతతో ఉన్నత చదువులు అభ్యసిస్తూ పరిశోధన రంగంలో తన ప్రతిభను చాటుకున్న పెసరు రాజు, హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం సమాచార సాంకేతిక విభాగంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టాను అందుకున్నారు. "హైపర్ స్పెక్ట్రల్ చిత్రాల వర్గీకరణలో త్రిమితీయ సాంకేతిక విధానాల వినియోగం" అనే అంశంపై ఆయన చేసిన పరిశోధన విశేష ప్రాధాన్యం సంతరించుకుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ చేసిన ఈ పరిశోధన భవిష్యత్తులో పలు రంగాలకు దోహదపడే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఈ పరిశోధనను హైదరాబాద్‌లోని ఎన్ఆర్ఎస్‌సీఇస్రోకు చెందిన శాస్త్రవేత్త డా. ఎం. నరేష్ కుమార్ పర్యవేక్షణలో విజయవంతంగా పూర్తి చేశారు. ఆయన అందించిన శాస్త్రీయ దిశానిర్దేశం, పరిశోధనలో చూపిన క్రమశిక్షణ పెసరు రాజు విజయానికి ముఖ్య కారణాలుగా నిలిచాయి. డాక్టరేట్ పట్టా సాధించిన సందర్భంగా పెద్ద పెండ్యాల గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది. గ్రామ పెద్దలు, యువకులు, స్నేహితులు ఆయనను అభినందిస్తూ, ఇలాంటి విజయాలు మరింత మంది యువతకు ప్రేరణ కావాలని ఆకాంక్షించారు. గ్రామం నుంచి వచ్చిన ఒక సాధారణ యువకుడు పట్టుదలతో ఈ స్థాయికి చేరడం గర్వకారణమని వారు పేర్కొన్నారు. డా. పెసరు రాజు విజయాన్ని ఆదర్శంగా తీసుకుని గ్రామ యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని కృషి చేయాలని పెద్దలు సూచించారు. తల్లిదండ్రులు తమ కుమారుడు సాధించిన ఘనతపై ఆనందం వ్యక్తం చేస్తూ, ఆయన భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన ఒక యువకుడు కష్టపడితే ఎలాంటి ఉన్నత శిఖరాలనైనా అధిరోహించవచ్చని డా. పెసరు రాజు విజయగాథ మరోసారి నిరూపించింది. ఆయన సాధించిన ఈ ఘనత పెద్ద పెండ్యాల గ్రామానికే కాకుండా మొత్తం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది.

# సాగర్ కాలవలో ప్రాణాలతో పోరాడిన గోమాత

## ప్రాణాలకు తెగించి కాపాడిన రానా



**కల్లూరు/ ఏప్రిల్ 6 (జర్నలిస్ట్ వార్త):**మానవత్వం మసకబారలేదని చాటిచెప్పే సంఘటన మండల పరిధిలోని రఘునాథ బంజర గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. సాగర్ కాలవలో ప్రమాదవశాత్తు పడిపోయి ప్రాణాలతో పోరాడుతున్న గోమాతను సాహసంతో రక్షించిన రానా గ్రామస్థుల ప్రశంసలను అందుకుంటున్నారు. వివరాల ప్రకారండ కాలవలో చిక్కుకుని బయటపడలేక కొట్టుమిట్టాడుతున్న గోమాతను గమనించిన రఘునాథ గూడెం గ్రామ సర్పంచ్ కుక్కా సుధారాణి భర్త రానా వెంటనే అప్రమత్తమయ్యారు. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకున్న ఆయన ఎలాంటి ఆలోచన లేకుండా కాలవలోకి దూకి గోమాతను రక్షించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే భయంతో ఉలిక్కిపడిన గోవు ఆయనను దగ్గరకు రానీయకపోవడంతో సుమారు రెండు కిలోమీటర్ల మేర కాలవలో ఈదుకుంటూ వెంబడించాల్సి వచ్చింది. ఇరువైపులా ఎత్తైన గోడలు ఉండటంతో రక్షణ చర్యలు మరింత క్లిష్టంగా మారినా, రానా ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. ప్రాణాలను పణంగా పెట్టి గోమాతను కాపాడాలన్న సంకల్పంతో ముందుకు సాగారు. చివరికి కొంత సౌలభ్యం ఉన్న ప్రాంతానికి చేరుకున్న తర్వాత స్థానికులను అప్రమత్తం చేసి, వారి సహకారంతో తాళ్ల సహాయంతో గోమాతను సురక్షితంగా ఒడ్డుకు తీసుకొచ్చారు. ఈ క్రమంలో గోవు భయంతో వెనుక కాళ్లతో తన్నినా, రానా తన ధైర్యాన్ని కోల్పోకుండా రక్షణ చర్యలు కొనసాగించారు. మూగజీవానికి ప్రాణదాతగా నిలిచిన రానా ధైర్యసాహసం గ్రామంలో ప్రశంసల వర్షం కురిపిస్తోంది. సేవాభావం, కరుణ కలగలిపిన ఆయన చర్య స్థానికులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది.
ఈ రక్షణ కార్యక్రమంలో కుక్కా లాలు, పోతురాజు రాము, అంజారావు, రావుల సీతయ్య, బండి వెంకయ్య, నల్లగొర్ల నాగేశ్వరరావు, కుక్క శ్రీనివాసరావు, కొలికపోగు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఏలుకుర్తిలో గుడుంబా విక్రేతపై కేసు నమోదు

**గీసుగొండ/ఏప్రిల్ 07(జర్నలిస్ట్ వార్త);**



మండల పరిధిలోని ఏలుకుర్తి గ్రామంలో అక్రమంగా గుడుంబా విక్రయిస్తున్న ఒక మహిళపై గీసుగొండ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పొడలా మణెమ్మ (60) తన నివాసం వద్ద ప్రభుత్వ నిషేధిత గుడుంబా విక్రయిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు దాడులు నిర్వహించి, ఆమె వద్ద నుంచి 4 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. పంచనామా నిర్వహించి నిందితురాలిపై కేసు నమోదు చేసినట్లు గీసుగొండ సీఐ డి. విశ్వేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడుంబా వల్ల ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుందని హెచ్చరించారు. ఎవరైనా చట్టవిరుద్ధంగా గుడుంబా తయారు చేసినా లేదా విక్రయించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ స్పష్టం చేశారు.

# కారు ఢీకొని కూలిన గోడ- వ్యక్తికి గాయాలు





**భీమదేవరపల్లి/ఏప్రిల్7 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన శివరాత్రి ఎల్లయ్య తన దుకాణంలో టీవీ చూస్తుండగా, వేగంగా వచ్చిన కారు అదుపు తప్పి దుకాణ గోడను ఢీకొట్టింది. ఈ ఘటనలో గోడ కూలిపోవడంతో ఎల్లయ్యకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 అంబులెన్స్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని, టెక్నీషియన్ లింగమూర్తి, పైలెట్ దయాకర్ ప్రథమ చికిత్స అందించారు. అనంతరం గాయపడిన ఎల్లయ్యను మెరుగైన చికిత్స కోసం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

# యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉత్సాహంగా దేవాలయ పనులు

### ముల్కనూర్‌లో శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయ ప్రతిష్ఠాపనకు వైభవంగా ఏర్పాట్లు





**భీమదేవరపల్లి/ఏప్రిల్7 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం దాతలు తమ వంతు సహకారం అందించారు. జక్కుల సరోజన మొగిలి గొల్ల కేతమ్మ దేవతకు పుస్తెలు, మట్టెలు సమర్పించారు. అలాగే రెండవ దేవత బలిజ మేడాలమ్మకు గిరబోయిన స్వరూప కుమారస్వామి పుస్తెలు, మట్టెలు అందించారు. శ్రీకృష్ణుని విగ్రహానికి జక్కుల యాదమ్మ ప్రకాశం రూ.50,116 విరాళంగా అందజేశారు. అదేవిధంగా శ్రీ మల్లికార్జున స్వామి వారి కిరీటం దొండ రాణి మల్లయ్య సమర్పించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం కుల పెద్దలు మాట్లాడుతూ, దేవాలయ నిర్మాణంలో భాగంగా దేవతలకు పుస్తెలు, మట్టెలు అందించిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా కొనసాగేందుకు గ్రామస్తులు, భక్తులు సమిష్టిగా కృషి చేస్తున్నారని తెలిపారు.

# ప్రజల సమస్యలపై చురుకైన స్పందన

## - పరిష్కార దిశగా సర్పంచ్ అడుగులు





**తల్లాడ/ ఏప్రిల్ 7 (జర్నలిస్ట్ వార్త):**
మండల పరిధిలోని ముద్దనూరు గ్రామంలో ప్రజల సమస్యలపై వెంటనే స్పందిస్తూ పరిష్కార దిశగా చర్యలు చేపడుతున్న సర్పంచ్ యరమల రామ్మోహన్ రెడ్డి సేవా దృక్పథం ప్రశంసలు అందుకుంటోంది. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తండ్రి బాటలో నడుస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నానని ఆయన తెలిపారు. ప్రజల కోసం పని చేసే నిజమైన ప్రభుత్వం అంటే తెలంగాణ ప్రభుత్వమేనని, ప్రజా పాలన ద్వారా ప్రతి ఇంటికి సంక్షేమం చేరేలా చర్యలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు. కేవలం మాటలు కాదుడ 99 రోజుల ప్రజా పాలనలో భాగంగా ప్రగతి ప్రణాళిక కింద రూపొందించిన కార్యాచరణతో గ్రామాల్లో మార్పు తీసుకువస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.2 లక్షల వ్యయంతో రెండు కొత్త బోర్లను త్రవ్వించారు. రంగాపురం గ్రామంలో ఒకటి, స్మశాన వాటిక వద్ద మరొకటి ప్రారంభించారు. వేసవికాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా, నెలలుగా అపరిష్కృతంగా ఉన్న సైడ్ కాలువలను యంత్రాల సహాయంతో శుభ్రపరిచించారు. రోడ్లపై పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి గ్రామాన్ని పరిశుభ్రంగా మార్చారు. వీధిలైట్ల సమస్యను పరిష్కరించేందుకు కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి నిరంతర విద్యుత్ సరఫరా అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూడ గతంలో తన తండ్రి యరమల వెంకటేశ్వర రెడ్డి సర్పంచ్‌గా ప్రజాసేవలో ముందుండేవారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.
గ్రామ ప్రజలు శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండనీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తడి-పొడి చెత్తను వేరు చేసి పారవేయాలని సూచించారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, ఉప సర్పంచ్ కంభంపాటి పద్మ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

